"నేనీ విగ్రహాన్ని చెక్కడానికి ఉపయోగించిన బండ మీ గ్రామంలోని మర్రి చెట్టు కింద ఉన్నదే. మీరు దాని మీద కూర్చుని దంతావధానం చేస్తూ దానిపై ఉమ్మేసేవారు. కొందరు దానిమీద రాత్రుళ్ళు మల మూత్ర విసర్జనా చేసేవారు. కొందరు చుట్టలు కాల్చి నుసిని దాని మీద రాల్చేవారు. నేనా రాతితోనే హనుమంతుడి విగ్రహాన్ని మలిచాను. ఇప్పుడది గొప్ప పూజలందుకుంటోంది. దీన్నించి మనం ఓ పాఠం నేర్చుకోవచ్చు. మనమంతా కూడా ఆ బండరాయి లాంటి వాళ్ళమే. బండలోని అనవసరపు భాగాలు చెక్కి తొలగిస్తే అప్పుడది దైవరూపంలోకి వచ్చింది. అలాగే మనం కూడా మనలోని స్వార్థపూరిత అవగుణాలని తొలగించుకోగలిగితే మనలోని పరమాత్మ మనకి దర్శనం ఇస్తాడు. ఇందుకు మనం దైవారాధన అనే ఉలితో మనలోని అసుర భావాలని నిత్యం చెక్కుకుంటూ వెళ్తే కొంత కాలానికి మనలోని దివ్యత్వం బహిర్గతమై 'మన దేహమే ఓ దేవాలయం' అన్న స్ఫురణ కలుగుతుంది. ఉట్టి పూజలతోనే సరిపెట్టుకోకుండా, మనల్ని మనం దైవంగా మలచుకునే పనిని శ్రద్ధగా మనమంతా చేపట్టాలి."

అప్పటి నుంచి ఆ గ్రామస్థులంతా నిత్యం ఆ దేవాలయానికి వచ్చి ఉదయం, సాయంత్రాలు ధ్యానం చేయసాగారు.

## 76. పొంచి వున్న అపాయం

పనిమీద పొరుగూరుకి వెళ్తున్న ఓ భర్తకి అతని భార్య మధ్యాహ్నానికి, రాత్రికి భోజనం కట్టి ఓ సంచీలో పెట్టిచ్చింది. ఆ సంచీని భుజానికి తగిలించుకుని అతను ప్రయాణమయ్యాడు. మధ్యాహ్నానికి ఓ అడవికి చేరుకున్నాడతను. ఓ చెట్టు కింద కూర్చుని సంచీలోంచి భార్య ఇచ్చిన భోజనం పొట్లం బయటకి తీసి దాన్ని తిన్నాడు. దగ్గరే ఉన్న సరస్సులోని నీటిని తాగి, కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని అతను తిరిగి ప్రయాణమయ్యాడు.

పొరుగూరులో పని ముగించుకుని అతను వెంటనే వెనుతిరిగాడు. సూర్యాస్తమయంలోపు ఇంటికి చేరుకోవాలనుకుని త్వర త్వరగా నడవసాగాడు. దారిలో ఓ బౌద్ధ భిక్షువు అతనికి ఎదురుపడ్డాడు. ఇతన్ని తేరిపార చూసి చెప్పాడు ఆ బౌద్ధ భిక్షువు.

"ఈ రాత్రి నువు ఇల్లు చేరితే నీ భార్యకి, చేరకపోతే నీకు మృత్యువు తప్పదు."

ఆ మాటల మీద ఇతనికి నమ్మకం ఏర్పడటంతో తన భార్యను మృత్యువు నించి కాపాడాలనుకుని, తనకి రాత్రికి భోజనం ఎటూ ఉంది కనుక తెల్లారే దాకా ఇంటికి వెళ్ళకూడదనుకున్నాడు. ఏ క్రూరజంతువు బారినో పడి చస్తాను అనుకుంటూ అడవిలో తిరుగుతున్న అతనికి ఓ చెట్టు కింద శిష్యులతో ఉన్న బుద్ధుడు కనిపించాడు. వెంటనే అతను బుద్ధుడి కాళ్ళ మీద పడి, ఇందాక బౌద్ధ భిక్షువు చెప్పింది వివరించి, తనని మృత్యువు నించి కాపాడమని ప్రార్థించాడు.

"అలాగే. కాని నాకు ఆకలి వేస్తోంది. ముందు తినడానికి నీ దగ్గరేమైనా ఉంటే పెట్టు." బుద్ధుడు చిరునవ్వుతో చెప్పాడు.

అతను అలాగేనని తన దగ్గర సంచీలో ఉన్న భోజనం పొట్లం కోసం సంచీని తెరవబోతూంటే, బుద్ధుడు అతన్ని వారించి, అతని చేతిలోని సంచీని అందుకుని, అందులోకి తన చేతిని చొప్పించి, లోపల నించి ఓ భయంకర సర్పాన్ని తీసాడు. తను మధ్యాహ్నం భోజన సమయంలో సంచీని నేల మీద ఉంచినప్పుడు ఆ పాము సంచీలోకి ప్రవేశించిందని ఆ గ్రామస్థుడికి అర్థం అయింది.

అతను వెంటనే బుద్ధుడి కాళ్ళమీద పడి చెప్పాడు.

"నన్ను మీరు రక్షించారు స్వామి. ఇంతసేపు నేను నా మృత్యువుని నేనే మోసుకుంటూ తిరుగుతున్నానని నాకు తెలీదు. నేనింటికి వెళ్ళివుంటే

మా ఆవిడ సంచీ తెరచి పాము కాటుకు గురయ్యేది. వెళ్ళకపోతే రాత్రి భోజనానికి సంచీ విప్పిన నాకూ అదే గతి పట్టేది."

బుద్ధుడు చిరునవ్వుతో ఆ గ్రామస్థుడితో చెప్పాడు.

"జీవితం అనే కారడివిలో ఏ దిక్కునించి ఎలాంటి అపాయం వస్తుందో అని జాగ్రత్తగా తిరుగుతాం. కాని మననో, మన ప్రియమైనవారినో చంపే అపాయాన్ని నిత్యం మన భుజాల మీదే మోస్తున్నామన్న సంగతిని మాత్రం మనం విస్మరిస్తాం. ఆ అపాయమే అహంకారం. దాన్ని ఆత్మజ్ఞాని అయిన గురువు చేతికి ఇస్తే, గురువు నిన్ను మరణం నించే కాక, జననం నుంచి కూడా రక్షిస్తాడు."

## 77. రెండు పాఠాలు

ముక్తికాంత మీద మనసు పడ్డ ఓ వ్యక్తి ఆత్మజ్ఞాని అయిన ఓ గురువు దగ్గరకు వెళ్ళి వినయంగా ఆయన పాదాలకి నమస్కరించి చెప్పాడు.

"స్వామి! మోక్షపు తాళంచెవి సద్గురువు దగ్గర ఉంటుందంటారు. దయచేసి నన్ను మీ శిష్యుడిగా స్వీకరించి, ఈ జన్మలోనే నేను ముక్తిని పొందేలా అనుగ్రహించవలసిందిగా కోరుతున్నాను."

"నీకు నా గురుత్వం నచ్చదేమో?" అనుమానం వ్యక్తం చేసాడా గురువు.

"అలాంటిదేం లేదు స్వామి."

ఆ రాత్రి పది మైళ్ళ దూరంలో ఉన్న ఓ గ్రామానికి శిష్యుడ్ని తీసుకెళ్ళాడు గురువు. అక్కడ రాత్రి పదిన్నర దాకా గ్రామస్థులకి రామాయణం కథని శిష్యుడి చేత చెప్పించాడు గురువు. కథ పూర్తయ్యేసరికి శిష్యుడికి ఆకలి దంచేస్తోంది. గ్రామస్థులు వారిద్దరికీ భోజనం తెచ్చారు.

"ఇవాళ ఏకాదశి. ఉపవాసం." గురువు భోజనాన్ని తిరస్కరించాడు.